నేడు డీవార్మింగ్ డే

పార్వతీపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో నులి పురుగుల నివారణకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 1,75,891 మంది చిన్నారులు, విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు వేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 84,426 మంది బాలురు, 88,465 మంది బాలికలు ఉన్నారని చెప్పారు. 400 మిల్లీ గ్రాముల మాత్రలను ఉచితంగా అందిస్తామన్నారు. 16న మాప్అప్ ఉంటుందని తెలిపారు.

ఆశాలపై ఉక్కుపాదం

- విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- ఎక్కడికక్కడే నిర్బంధాలు.. అరెస్టులు
- భగ్గుమన్న ఉద్యోగినులు
- జిల్లా వ్యాప్తంగా నిరసనలు



సాలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశాకార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలు


పాలకొండ:ప్రజా సంఘాలు నాయకులు, ఆశాలను అరెస్టు చేసిన దృశ్యం

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి)/ సాలూరు/రూరల్, పాలకొండ/ బెలగాం/ గరుగుబిల్లి/ పాచిపెంట, ఫిబ్రవరి 8: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమైన ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. గురువారం జిల్లా నుంచి విజయవాడకు వెళ్లకుండా వారిని ఎక్కడికక్కడే పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టులు, నిర్బంధాలతో వారిని భయభ్రాంతులకు గురి చేశారు. జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు వివిధ మండలాల్లో ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాలూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాలకొండలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావుతో పాటు 22 మంది ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలను నిరసిస్తూ ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశావర్కర్ల నిరసన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులకు నిరసనగా నినాదాలు చేశారు. నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పాచిపెంట మండల ఆశావర్కర్ల యూనియన్ నాయకులు అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్, రూ.10లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికై పోరాటం చేస్తున్న తమను నిర్బంధించడం విచారకరమన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.


పాచిపెంట: మాట్లాడుతున్న యూనియన్ నాయకులు



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఆశాకార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలు


గరుగుబిల్లిలో..

అరాచకంపై శంఖారావం



- 13, 14న జిల్లాలో లోకేశ్ పర్యటన
- ప్రజలు, శ్రేణుల్లో చైతన్యం నింపడమే లక్ష్యం

పార్వతీపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అరాచక పాలనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి నారా లోకేశ్ శంఖారావం పూరించనున్నారు. ఇప్పటికే విశాఖ వరకూ యువగళం పాదయాత్ర పూర్తిచేశారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ పర్య టించేలా 'శంఖారావం యాత్ర' పేరుతో ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. ప్రజలు, పార్టీ శ్రేణుల్లో చైతన్యం నింపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటిస్తారు. మొత్తం పర్యటన యాభై రోజులు కొనసాగనుంది. రానున్న ఎన్నికలకు పార్టీ కేడర్‌ను కార్యోన్ముఖులను చేసే లక్ష్యంతో యువనేత పర్యటన సాగనుంది. వైసీపీ పాలనలో వైఫల్యాలు వివరిస్తూ.. దోపిడీ విధానాలు ఎండగట్టనున్నారు. అదే సమయంలో వివిధ వర్గాలకు భరోసా కల్పిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేయనున్నారు. ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను ఏవిధంగా ఎదుర్కోవాలనే అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లి కేడర్‌తో సమావేశమవుతారు. ఉత్తరాంధ్రలో జగన్ అండ్ కో చేసిన విధ్వంసం, ఆయా నియోజకవర్గాల్లో నెల కొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి అధికారంలోకి వచ్చాక చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చిస్తారు. శంఖారావం యాత్ర సందర్భంగా వైసీపీ పాలనలో తప్పుడు కేసులు, వేధింపులకు గురైన కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలకు లోకేశ్ భరోసా కల్పిస్తారు.

జిల్లా షెడ్యూల్ ఇలా..

ఈ నెల 13న పాలకొండ, కురుపాం, 14న పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో లోకేశ్ పర్య టించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో బహిరంగ సమావేశాలు నిర్వహించనున్నారు. లోకేశ్ పర్యటన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నిమ్మక జయకృష్ణ, తోయిక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

రాళ్లు పేల్చకుండానే.. బిల్లు చెల్లించేశారు!

- దోకులగూడ రోడ్డు పనుల్లో అక్రమాలు
- రూ.35 లక్షల బిల్లు అప్‌లోడ్ చేసిన అధికారులు
- సమగ్ర విచారణకు గిరిజనుల డిమాండ్

దోకులగూడ రోడ్డు పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ పనుల్లో భాగంగా కొండలపై రాళ్లు పేల్చాల్సి ఉంది. కానీ, రాళ్లు పేల్చకుండానే కాంట్రాక్టర్‌కు రూ.35లక్షల బిల్లులు చెల్లించేశారు. దీనికి సంబంధిత అధికారులు సహకరించినట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు. పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

(భామిని/సీతంపేట)

భామిని మండలంలోని మారుమూల కొండ శిఖర గ్రామమైన దోకులగూడ గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించేందుకు 2017-18లో ఉపాధి హామీ పథకం కింద రూ.63 లక్షలను అప్పటి ఐటీడీఏ పీవో మంజూరు చేశారు. ఈ పనులను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. మొత్తం రూ.56.6 లక్షలు ఖర్చు చేసినట్టు నివేదికలో పొందుపరిచారు. అయితే పనుల్లో జాప్యం జరుగు తుందని చెప్పి పంచాయతీరాజ్ శాఖను తప్పించి గిరిజన ఇంజనీరింగ్‌శాఖకు 2022లో అప్పటి ఐటీడీఏ పీవో అప్పగించారు. అయినప్పటికీ పనులు జరగకపోవడంతో ఆదివాసీలు పీవోను ఆశ్రయించారు. దీంతో గతేడాది పనులు మొదలుపెట్టారు. అవసరమైన వర్కింగ్ ఎస్టిమేట్ వేసి చీఫ్ సూపరింటెండెంట్ అనుమతి తీసుకుని రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ పనులు చేపడుతున్న కాంట్రాక్టరు తనకు అనుకూలంగా బిల్లులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చాడనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో విధులు నిర్వహించిన ఏఈ, డీఈ, ఈఈలు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. వారి స్థానంలో కొత్తవారు వచ్చారు. వీరు విధుల్లో చేరిన కొన్ని నెలలకే ఆ శాఖకు చెందిన కీలక అధికారి ఆదేశాల మేరకు దోకులగూడ రోడ్డు పనుల్లో బ్లాస్టింగ్ చేయకుండానే రూ.35లక్షల బిల్లు కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు. గతేడాది జూన్‌లో ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో దోకులగూడ రోడ్డును పరిశీలించారు. ఇది నక్సలైట్ ప్రభావిత ప్రాంతం కావడంతో బ్లాస్టింగ్ చేయడానికి అనుమతి లేదని, రాక్ కటింగ్ మెషిన్‌తో పనిచేయాలని, ఘనపు మీటర్‌కు రూ.558 అత్యధికంగా చెల్లించాలని రికార్డు చేసి కొత్తగా వర్కింగ్ ఎస్టిమేట్‌ను గతేడాది ఆగస్టు 5న ఎస్ఈ అనుమతి కోసం పంపించారు. దీనికి సెప్టెంబరు 9న ఎస్ఈ సాంకేతిక ఆమోదం తెలపడంతో బ్లాస్టింగ్ చేయకుండానే రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లకు మరమ్మతులు చేపట్టి అదే నెల 26న బిల్లును అప్‌లోడ్ చేశారు. దీనిపై గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారి పనుల్లో అసలు రాయి పేల్చకుండానే బిల్లు ఎలా చెల్లిస్తారంటూ ఈ నెల 5న ఐటీడీఏ స్పందనలో పీవోకు ఫిర్యాదు చేశారు. పనులపై సమగ్ర విచారణ చేపట్టి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పనుల అక్రమాలపై ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు (ఫైల్)


దోకులగూడ రహదారి పనులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు (ఫైల్)


రహదారి సౌకర్యం లేని దోకులగూడ గ్రామం

ఎలాంటి అక్రమాలు జరగలేదు..

దోకులగూడ గ్రామ రహదారి పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదు. రాళ్లు పేల్చడానికి రూ.35 లక్షల బిల్లు అప్‌లోడ్ చేయడం వాస్తవమే. అక్కడ బ్లాస్టింగ్ చేయడం జరిగింది. మిగిలిన పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తాం.

-సింహాచలం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గిరిజన సంక్షేమ శాఖ

విజిలెన్స్ విచారణ చేపట్టాలి..



దోకులగూడ రోడ్డు పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలి. రాళ్లు పేల్చకుండానే గిరిజన ఇంజనీరింగ్‌శాఖ అధికారులు రూ.35 లక్షలు బిల్లులు అప్‌లోడ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

-కొండగొర్రె భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి, ఆదివాసీ గిరిజన సంఘం

కఠిన చర్యలు తీసుకోవాలి..



రహదారి పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్‌కు ఇంజనీరింగ్ అధికారులు సహకరించారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలి.

-కొండగొర్రె ప్రసాద్, ఏపీ గిరిజన సంఘం అధ్యక్షుడు

ఇదేమి ఎంపిక?

- 'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు రన్నర్ జట్టు
- ఆందోళనకు దిగిన విజేత జట్టు క్రీడాకారులు


కలెక్టర్ కార్యాలయం ముందు రోడ్డుపై బైఠాయించిన పాచిపెంట క్రికెట్ క్రీడాకారులు

పార్వతీపురం/ బెలగాం, ఫిబ్రవరి 8: పార్వతీపురంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీల్లో పార్వతీపురం మండల జట్టుపై పాచిపెంట మండల జట్టు విజయం సాధించింది. దీంతో కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా పాచిపెంట క్రీడాకారులు ట్రోఫీ అందుకున్నారు. వీరిని కలెక్టర్ అభినందించి రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో గురువారం డీఎస్‌డీవో కార్యాలయానికి పాచిపెంట క్రీడాకారులు వెళ్లారు. 'మీరు నిబంధనలు పాటించక పోవడంతో డిస్ క్వాలిఫై చేశాం. ద్వితీయ స్థానం పొందిన పార్వతీపురం జట్టును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశా'మని అక్కడి అధికారులు చెప్పడంతో పాచిపెంట క్రీడాకారులు ఖంగుతిన్నారు. నిబంధనలు పాటించకపోతే మ్యాచ్ జరిగినప్పుడే అభ్యంతరం చెప్పాలి గానీ, వారం రోజుల తర్వాత, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే ముందు చెప్పడం ఏంటని వారు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. జట్టు ఎంపికలో ఎటువంటి లోపాలు లేవని, నిబంధనలు ప్రకారమే నడుచుకున్నామని, తమకు అన్యాయం చేయవద్దని అన్నారు. స్థానిక రాజకీయ నేతల ఒత్తిడితోనే తమను డిస్‌క్వాలిఫై చేశారని, న్యాయం జరిగేవరకు పోరాడుతామని తెలిపారు. ఈ విషయమై డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 'పాచిపెంట క్రికెట్ జట్టు జిల్లా స్థాయి ఫైనల్ మ్యాచ్‌లో నిబంధనలు పాటించలేదు. అందుకే ఆ జట్టు గెలిచినా రాష్ట్రస్థాయి పోటీలకు డిస్‌క్వాలిఫై చేశా'మని తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన పీవో

సాలూరు, ఫిబ్రవరి 8: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ గురువారం పరిశీలించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను క్షేత్ర స్థాయి అధికారులు బాధ్యాతాయుతంగా చూసుకోవాలని కోరారు. భద్రతతో పాటు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం. ఆనంద్ కుమార్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

చెట్టు కిందే బోధన

- వెలగవలస ప్రాథమిక పాఠశాలలో ఒకే గది
- వరండా, చెట్ల కిందే తరగతులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 8: మరిపిల్లి పంచాయతీ వెలగవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులను వసతి సమస్య వేధిస్తోంది. ఈ పాఠశాలకు ఒకే గది ఉంది. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 45 మంది విద్యార్థులు చదువుతున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అయితే, సరిపడ గదులు లేకపోవడంతో బోధనకు ఇబ్బందులు పడుతున్నారు. ఒకరు గదిలో, మరొకరు వరండాలో, ఇంకొకరు చెట్టు కింద విద్యార్థులకు బోధిస్తున్నారు. నాడు-నేడు కింద పాఠశాలలో సదుపాయాల కల్పనకు రూ.12 లక్షలు, అదనపు తరగతి నిర్మాణానికి రూ.12 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. కానీ, ఇప్పటి వరకు రూ. 8 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఈ నిధులతో తరగతి గది ఫ్లోరింగ్, శ్లాబ్ మరమ్మతులు, కిచెన్ షెడ్డు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టారు. అదనపు తరగతి గది నిర్మాణం పునాది స్థాయిలో నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వరకూ పాఠశాల సమీపంలో ఖాళీగా ఉన్న జీడిపిక్కల గిడ్డంగిలో బోధన సాగించేవారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో మళ్లీ పాఠశాలకు విద్యార్థులను తీసుకువచ్చారు. ఇప్పటికైనా అదనపు తరగతి నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంతవరకూ జీడిపిక్కల గిడ్డంగిని తరగతులకు వినియోగించుకునేలా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు మన్మథరావు మాట్లాడుతూ.. 'నిధులు రాగానే అదనపు గది నిర్మాణం పూర్తి చేయిస్తాం. ఎంతవో, గ్రామస్థులతో చర్చించి బోధనకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటా'మని తెలిపారు.


చెట్టు కింద, వరండాలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

టీడీపీ హయాంలోనే బీసీలకు భరోసా

- ఆ వర్గాలకు తొలి నుంచి అండగా పార్టీ
- 'జయహో బీసీ'లో నాయకులు


విజయనగరంలో జయహో బీసీ కార్యక్రమంలో అదితి, టీడీపీ నాయకులు


నెల్లిమర్లలో మాట్లాడుతున్న బంగార్రాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 8: టీడీపీ హయాంలోనే బీసీలకు భరోసా లభించిందని, రానున్న కాలంలో ఇదే పరిస్థితి కొనసాగుతుందని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు తెలిపారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు గురువారం దుప్పాడలో 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, బీసీల సంక్షేమానికి తొలి నుంచి టీడీపీ ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వచ్చిందన్నారు. బడ్జెట్‌లో కూడా కేటాయింపులు అధికంగా చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఐదు పర్యాయాలు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా బీసీలకు కేటాయింపులు అంతంత మాత్రమేనన్నారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా బీసీల కోసం ప్రత్యేకంగా ఏమీ కేటాయింపులు లేవన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత బీసీలపై చిన్నచూపు మొదలైందన్నారు. బీసీలపై దాడులు పెరిగాయన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆదరణ పథకాన్ని ఎత్తేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు టీడీపీ, జనసేనకి అండగా నిలవాలన్నారు. టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, కంది మురళీనాయుడులు మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయిలో 'జయహో బీసీ' కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. అదే స్ఫూర్తితో మండల స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, వేచలపు శ్రీను, వెన్నె సన్యాసినాయుడు, ముద్దాడ చంద్రశేఖర్, కోండ్రు శ్రీనివాసరావు, గంటా పోలినాయుడు, పూసపాటి రాజేష్‌వర్మతో పాటు, టీడీపీ మండల, నగర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుప్పాడలో 'భవిష్యత్తుకి భరోసా'

టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు గురువారం రాత్రి దుప్పాడ గ్రామంలో భవిష్యత్తుకి భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, రాజేష్‌వర్మ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దుప్పాడ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అదితి గజపతిరాజుకి ఘన స్వాగతం పలికారు. అదితి గజపతిరాజు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు.

బీసీలే వెన్నెముక: బంగార్రాజు

నెల్లిమర్ల: టీడీపీకి బీసీలే వెన్నెముక అని పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. గురువారం నెల్లిమర్లలో టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ అధ్యక్షతన జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంగార్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు గుర్తింపు లభించిందని చెప్పారు. వైసీపీ పాలనలో బీసీలకు దారుణంగా అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, బైరెడ్డి లీలావతి, లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు, బొంతు వెంకటరమణ, తాడ్డి సత్యనారాయణ, అవనాపు సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం విజయనగరం పార్లమెంటరీ రెడ్డిక సాధికార కమిటీ కన్వీనర్‌గా ఎంపికైన నీలాపు అప్పలరామిరెడ్డికి సన్మానించారు.

మైనార్టీ కుటుంబానికి ఆర్థికసాయం

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన షేక్ శ్రీదేవి కుటుంబానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్లలలితకుమారి, రాంప్రసాద్ దంపతులు ఆర్థికసాయం అందించారు. గురువారం గ్రామ పెద్దలు మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో కోళ్ల దంపతులు రూ.10వేల నగదును షేక్ అసిన్‌పెండ్లి నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో కరెడ్ల ఈశ్వరరావు, షేక్‌రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించినట్లు ట్రైనీ మాస్టర్ శివాజీ తెలిపారు. గురువారం హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు స్కౌట్స్ అండ్ గైడ్స్ గురించి వివరించారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

బొబ్బిలి: సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకున్నామని ఏఎస్‌డబ్ల్యూఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఎ,బి,సి,డి కేటగిరీలుగా గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. లెక్కలు, ఇంగ్లీషు, సైన్స్, హిందీ సబ్జెక్టులలో వారికి మరింత అవగాహన కల్పిస్తామన్నారు. ఐదు ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 33 మంది టెన్త్ విద్యార్థులు చదువుతున్నారని వివరించారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్‌ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి అన్నారు. గురువారం వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణంలోని శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణ పొందిన యువతతో మాట్లాడారు. సీడాప్ సీఈవో శ్రీనివాసులు, మేనేజర్ మార్టిన్ లూథర్, గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను పునరుద్ధరించాలి

బొబ్బిలి, ఫిబ్రవరి 8: పరిపాలనాపరమైన వివిధ కేసులకు సంబంధించి సత్వర పరిష్కారం కోసం ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ట్రిబ్యునల్ లేకపోవడంతో కొన్ని వివాదాలు పరిష్కారానికి నోచుకోక ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోతున్నాయని అన్నారు. గత నాలుగు సంవత్సరాలలో నియామకాలు, వేతన నిర్ణయం, సీనియారిటీ, పదోన్నతులు, బదిలీలు తదితర అంశాలకు సంబంధించి సుమారు 16 వేల రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ట్రిబ్యునల్‌ను పునరుద్ధరించాలని. తద్వారా కేసుల సత్వర పరిష్కారానికి వీలవుతుందని జోగినాయుడు అన్నారు.

ఉపాధి కూలీలకు గమేళాల పంపిణీ

బొబ్బిలి: పిరిడి గ్రామంలో జయం సేవా సంస్థ వ్యవస్థాపకుడు మరడ సాయిశంకర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఉపాధి హామీ కూలీలకు సుమారు వెయ్యి గమేళాలను పంపిణీ చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన వీటిని మహిళా కూలీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జేఆర్‌కే రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డీవార్మింగ్ డే

బొబ్బిలి: నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. మండలంలో ప్రభుత్వ వైద్యులకు, సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ కోసం ఎంపీడీవో అందజేశారు.

వేపాడ: ప్రతి ఆరు నెలలకు ఒకసారి చిన్నారుల్లో నులు పురుగుల నివారణ కోసం చేపట్టే జాతీయ నులు పురుగుల దినోత్సవాన్ని మండలంలో విజయవంతం చేయాలని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు కోరారు. గురువారం వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధరణి సారధ్యంలో మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించిన జాతీయ నులు పురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో శుక్రవారం చేపట్టే నులుపురుగుల నివారణ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని అందరు విజయవంతం చేయాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు నులు పురుగుల నివారణ మాత్రలను మింగించాలన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పారావు,తహశీల్దార్ ప్రసన్నకుమార్, వైద్యులు రమాదేవి, సీహెచ్‌వో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జామి: మనకు అనారోగ్యం కలిగించే నులిపురుగులను అల్బెండజాల్ మాత్రలతో నివారిస్తాయని పీహెచ్‌సీ హెల్త్‌ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్ అన్నారు. గురు వారం మండల కేంద్రమైన జామి ఉన్నత పాఠశాలలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. నులి పురుగులను నిర్మూలించడం వల్ల రక్తహీనత ను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్‌రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.


జామి ఉన్నతపాఠశాలలో అవగాహన సదస్సు

ఓటమి అంచున వైసీపీ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 8: వైఎస్‌ఆర్‌సీపీ ఓటమి అంచున ఉందని, ఆ పార్టీ శ్రేణులన్నీ భయాందోళనలో ఉన్నాయని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం కోళ్ల కుటుంబాన్ని రాష్ట్ర జనసేన కార్యదర్శి విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి పాలవలస యశస్వి పరామర్శించారు. అనంతరం ఇరువురూ ఒ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ-జనసేన కూటమి రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీ సీట్లతో విజయదుందుబి మోగించడం ఖాయమని అన్నిసర్వేలు తేల్చి చెప్పడంతో వైసీపీకి చమటలు పడుతున్నాయన్నారు. జగన్‌కు ఏమి చేయాలో తోచక ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, వైసీపీ ఓటమి ఖాయమని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలే బహిరంగంగా చెప్పడం ఇందుకు తార్కాణమని తెలిపారు. ఎన్నికల కోడ్ వస్తే కొన్నిచోట్ల అభ్యర్థులను నిలపలేని పరిస్థితి జగన్ ఎదుర్కొంటాడని తెలిపారు. టీడీపీ-జనసేన కార్య కర్తలంతా ఎన్నికలకు సి ద్ధంగా ఉండాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ, పిరోజ్, వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ-జనసేన నేతలు

16 న దేశవ్యాప్తంగా రవాణా రంగం బంద్



ప్రచారం చేస్తున్న యూనియన్ నాయకులు

బొబ్బిలి, ఫిబ్రవరి 8: ఫిట్‌నెస్ పేరుతో వాహనదారుల నుంచి భారీ దోపిడీకి పాల్పడుతు న్న ప్రభుత్వాల విధానాని కి నిరసనగా ఈ నెల 16 దేశవ్యాప్తంగా రవాణా రంగం బంద్ పాటిస్తున్న ట్లు సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు తెలిపారు. దీనికోసం లైట్‌వెహికల్ సంఘం నాయకుడు ఆల్తి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆటోల పార్కింగ్ సెంటర్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్ర క్రియను జిల్లాల వారీగా బడా కంపెనీలకు కట్టబెట్టేందుకు టెండర్లు పిలవడం సిగ్గుచేటన్నారు. ఈ సర్టిఫికెట్ల జారీకి వాహనదారుల నుంచి వసూలు చేసే రుసుంను భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వాహనదారులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫిట్‌నెస్ పేరుతో 700 నుంచి 15 వేల రూపాయల వరకూ రుసుం పెంచేయడం అన్యాయమన్నారు. తక్షణం ఈ విదానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వారంతా నినాదాలు చేశారు. 16న బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

అతి వేగంతోనే ప్రమాదాలు


మాట్లాడుతున్న ఎంవీఐ రవిశంకర్ ప్రసాద్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 8: వాహనదారులు అతి వేగంగా నడపడం వల్ల ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని ఎంవీఐ రవి శంకర్ ప్రసాద్ అన్నారు. గురువారం నెల్లిమర్ల జూనియర్ కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవ గాహన పెంపొందించుకోవాలన్నారు. డీఎస్పీ గోవిందరావు, ఎంఈవో విజయ్ కుమార్, రోడ్డు సేఫ్టీ వైద్యాధికారి డాక్టర్ సాయికుమార్, ఎస్ఐ డి.రామగణేష్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో అధ్యక్షులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

బొబ్బిలి: గుజరా త్‌లో ఈ నెల 22న జరగ నున్న జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు పారాది జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగేశ్వరరావు, పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు. ఈ పాఠశాల నుంచి సుప్రియ, తేజస్విని, చైతన్య ఎంపిక కావడంతో వారంతా జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుకొని పాఠశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రుద్రాభిషేకం


108 శివలింగాలకు పూజలు చేస్తున్న దృశ్యం

కొత్తవలస, ఫిబ్రవరి 8: మాస శివరాత్రి సందర్భంగా తుమ్మికాపల్లి రైల్వేగేటు సమీపంలోనున్న ఓం సదనంలో గురువారం 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఇక్కడ ప్రతినెలా మాస శివరాత్రి రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. అందులో భాగంగానే గురువారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లోక శాంతికోసం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు అంపోలు ఉమామహేశ్వర శర్మ తెలిపారు. 16న రథసప్తమి సందర్భంగా సౌర హోమం, సూర్య నమస్కారాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

కొత్తవలస స్టేషన్‌లో నిలిచిపోయిన కిరండోల్

- ఆలస్యం కావడంతో ప్రయాణికుల ఆందోళన


స్టేషన్‌లో ప్రయాణికుల ఆందోళన

కొత్తవలస, ఫిబ్రవరి 8: విశాఖపట్టణం నుంచి అరుకు వెళ్లే రైలు కొత్తవలస రైల్వేస్టేషన్‌లో గంటల తరబడి నిలిచిపోవడంతో గురువారం ప్రయాణికులు కొత్తవలస రైల్వేస్టేషన్‌లో ఆందోళన చేశారు. విశాఖపట్టణం నుంచి అరుకు మీదుగా కిరండోల్ వెళ్లే ట్రైన్ కొత్తవలస స్టేషన్‌కు ఉదయం 7 గంటలకు రావలసి ఉండగా 9 గంటలకు వచ్చింది. అప్పటి నుంచి రైల్వే అధికారులు ప్రయాణికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్టేషన్‌లోనే గంటల తరబడి నిలిపేయడంతో ప్రయాణికులు స్టేషన్‌లో ఆందోళన చేశారు. అరుకు వెళ్లే దారిలోని చిమిడిపల్లి వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. తిరిగి 12 గంటలకు రైలు కదలడంతో ప్రయాణికులు ఆందోళన విరమించారు. గతంలో రైల్వేశాఖ ప్రత్యామ్నాయంగా బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికులను పంపేదని, ఇప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు కొపోద్రిక్తులయ్యారు.

అందరి సహకారంతో అభివృద్ధి

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 8: ప్రజలందరి సహకారంతో నగర అభివృద్ధికి మరింత కృషి చేస్తానని నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. గురువారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. 11 అంశాలతో రెండు అత్యవసర సమావేశాలు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ మల్లయ్యనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావులను సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం నగరం అభివృద్ధి చెందిందన్నారు. అంబేద్కర్ భవనాన్ని రూ.39.90 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించేందుకు సభ్యులు ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ రాజేష్, డిప్యూటీ మేయర్లు శ్రావణి, లయ యాదవ్‌తో పాటు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో 130 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. సారిక, జమ్ము ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఈ పట్టాలు అందజేశారు. మేయర్ మాట్లాడుతూ, ఇళ్ల పట్టాలతో పాటు, ఇంటి నిర్మాణం చేపట్టేందుకు సహాయ, సహకారాలు అందిస్తున్నామన్నారు.

బాలికల సాధికారతే లక్ష్యం


విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేసిన దృశ్యం

వేపాడ: మెరుగైన ఉజ్వల భవిష్యత్తు కోసం 2040 నాటికి 20 లక్షల ఆడపిల్లలను శక్తివంతులుగా తీర్చిదిద్దడమే బిల్డింగ్ బ్లాక్స్ గ్రూపు లక్ష్యమని ఆ సంస్థ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లి కార్జునరెడ్డి అన్నారు. మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సాఫ్ట్ స్కిల్ నిపుణులు ఇరోతి సతీష్ కుమార్, లక్ష్మీ శంకర్ సందర్శించి ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు చిన్నతనం నుంచి ఎలా ఎదగాలి, ఎలా చదవాలి, గురువుని ఎలా గౌరవించాలి, చిన్నతనం నుంచి నాయకత్వ లక్షణాలను ఎలా నేర్చుకోవాలి, జీవితంలో ఎదురైన సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఫ్లోరెన్స్, కిలపర్తి అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేం ద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ

బాడంగి : మండల కేంద్రంలో, గ్రామాలలో గల పలు పోలింగ్ కేం ద్రాలను బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు గురువారం పరిశీలించారు. స్థానిక గురుకులంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వసతులు ఎలా ఉన్నాయి, భద్రతకు సంబంధించిన అంశాలను ఆయన పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, తలుపులు, కిటికీలు వంటివి ఎలాఉన్నాయోనని ఆయన పరిశీలించారు. పోలీసుస్టేషన్‌లో సిబ్బందితో సమావేశమై సమస్యాత్మక గ్రామాలు, తగాదాలను ప్రోత్సహించే వ్యక్తుల వివరాలను సేకరించారు. బైండోవర్ కేసులను ఏమేర నమోదు చేశారని అడిగి తెలుసుకున్నారు.

వేసవిలో కోతలు లేకుండా చూడండి

- ట్రాన్స్‌కో ఈఈ సురేష్‌బాబు


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ సురేష్‌బాబు తదితరులు

రాజాం రూరల్, ఫిబ్రవరి 8: వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా.. సరఫ రాలో అంతరాయం ఏర్పడకుండా, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు, ఏఈ కుమార్, సిబ్బందిని ఆదేశించారు. డీఈ బి.వి.ఎన్.ఫణీంద్ర కుమార్‌తో కలసి గురువారం సాయంత్రం వివిధ సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. చిన్నపాటి మరమ్మ తులను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. అంతకుముందు గోపాలపురం సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ పనులను ఈఈ సురేష్‌బాబు పరిశీలించారు.

వేపాడలో పీఎం మాతృత్వ అభియాన్

వేపాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ధరణి ఆధ్వర్యంలో గురువారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 48 మంది గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. బానాది సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

కలెక్టరేట్, ఫిబ్రవరి 8: మధ్యాహ్న భోజన పథకంక నిర్వాహకులు గురువారం డీఈవో కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కె.స్రవంతి మాట్లాడుతూ భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వేతనం సరిపోవడం లేదన్నారు. తక్షణమే రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 8 నెలలుగా రాగి జావ పిల్లలకు పెడుతున్నా మెస్ చార్జీలు చెల్లించలేదన్నారు. అనంతరం డీఈవో కార్యాలయ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.రంగరాజు, ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

వ్యక్తి ఆత్మహత్య

భోగాపురం: అప్పుల బాధపడలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సీఐ ఎ.రవికుమార్ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం భోగాపురం గ్రామానికి చెందిన ఆళ్ల కన్నారావు(55) స్థానిక తోటవీధిలో కుటుంబంతో కలిసి నివాసముంటూ, గ్రామ సమీపంలో ఇటుక బట్టీ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇటుక వ్యాపారం నిమిత్తం అప్పులు చేసి వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాడు. అయితే వ్యాపారం సరిగ్గా సాగకపోవడంతో ఆర్థికంగా చితికిపోయి, కొద్ది రోజులుగా సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం పిల్లలిద్దరినీ పాఠశాలకు దిగబెట్టి, అక్కడి నుంచి వస్తూ ఆలయ సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి దాటాక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, సాగర్, భవేష్ ఇద్దరు మగపిల్లలు, తల్లి ఉన్నారు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

కొత్తవలస: బెల్ట్ మద్యం షాపు ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని 37 మద్యం సీసీలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. కంటకాపల్లి పంచాయతీ, కొత్తూరు గొప్పువద్ద డి.ఈశ్వరరావు అనే వ్యక్తి బెల్ట్‌షాపు ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయం చేస్తున్నట్టు సమాచారం రావడంతో బుధవారం రాత్రి సిబ్బందితో వెళ్లి దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడులలో 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

రామభద్రపురం: మండల పరిధిలోని కొండకెంగువ ఏడొంపులగెడ్డ సమీపంలో టూవీలర్‌పై మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. రామభద్రపురానికి చెందిన వ్యక్తి 55 మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలో పెద్దపుర్లి గ్రామంలో గురువారం స్థానిక పోలీసులు ఎన్నికల విధుల్లో బాగంగా నిర్వహించిన సోదాల్లో ఒక్కవ్యక్తి 28 మద్యంబోటెళ్లతో పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో బెల్టెషాపు నిర్వహిస్తుండగా రెడ్‌హెండెడ్‌గా పట్టుకొని నిందుతుడున్ని అరెస్టుచేసినట్లు ఎస్ఐ తెలపారు.

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో గురువారం 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్ఐ కొండలరావు తెలిపారు. గ్రామానికి చెందిన సుబ్బు నవీన్ అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించి అతడిని అరెస్టుచేసి కేసు నమోదు చేశామని తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేశామన్నారు.

పాచిపెంట: బడ్నాయికవలస గ్రామ సమీపంలో అక్రమంగా సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన సోములు గోపాలంను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏఎస్ఐ బి.ముసలినాయుడు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 300 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

జూదరుల అరెస్టు

బొబ్బిలి: మండలంలోని అలజంగి చెరువు గట్టు సమీపంలో పేకాటాడుతుండగా 11 మందిని పట్టుకున్నట్లు ఎస్ఐ జి.లోవరాజు తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం అర్ధరా త్రి దాటిన తరువాత నిఘా వేసి పేకాట శిబిరంపై దాడులు నిర్వహించామన్నారు. 11 మందిని పట్టుకొని వారి నుంచి 30,380 రూపాయలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దత్తిరాజేరు: కోరపుకొత్తవలస గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు గ్రామ శివారులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఈ తనిఖీల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.3,050 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలిలో గురువారం జరిగిన వాహన తనిఖీలలో 21 కేజీల గంజాయి పట్టుబడింది. అరకు నుంచి విశాఖకు వెళుతున్న ఆటోను ఎస్.ఐ. మోహనరావు తనిఖీ చేశారు. అనంతగిరి మండలం కొటపర్తికి చెందిన అశోక్, గుమ్మకోట గ్రామానికి చెందిన రైడి మహేష్‌లు గంజాయితో పట్టుబడ్డారు. ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రేషన్ దుకాణాలపై తూనికలు-కొలతల అధికారుల దాడులు


ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 8: ప్రజా పంపిణీ సరుకుల తూకంలో జరుగుతున్న మోసాల దృష్ట్యా విజయనగరం తూనికలు, కొలతల శాఖాధికారులు జిల్లాలోని డెంకాడ, బొండపల్లి మండలాల్లో ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తూకంలో తేడాలు చేసే వారు, సీల్ లేకుండా తూకపు రాళ్ల వినియోగిస్తున్న వారిపై ఐదు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ దామోదర్ మాట్లాడుతూ సరుకుల తూకంలో వినియోగదారులను మోసం చేసినా, నిర్ధారించిన ధరల కంటే అధిక ధరలు వసూలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామ హె చ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను పట్టించుకోరా?


తాంద్రంగి వీధుల్లోకి వచ్చే దారిలేక వీధి బయటే ఉండిపోయిన బియ్యం వ్యాన్

జామి, ఫిబ్రవరి 8: తాంద్రంగిలో పంచాయతీ అధికారులు ఉన్నారా? లేరా? వీరిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని గ్రామ యువత ప్రశ్నిస్తున్నారు. గురువారం కొత్తలి గౌరినాయుడు ఆధ్వర్యంలో వీరు మాట్లాడుతూ గ్రామంలో చాలమంది వీధిలో ఉన్న కాలువలు.. సీసీ రోడ్లు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నా అడ్డుకునే వారు కనిపించడం లేదన్నారు. వీరి నిర్వాకంతో వీధుల్లోకి ద్విచక్ర వాహనాలు తప్ప ఇంకేమీ వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. బియ్యం సరఫరా చేసే వ్యాన్ వచ్చే దారి లేక వారు దూరంగా ఉండి... ఇచ్చి వెళ్లిపోతున్నారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

సాయన్న చానెల్‌ను విస్మరించడం అన్యాయం

రేగిడి, ఫిబ్రవరి 8: మండలంలో 8వేల ఎకరాల ఆయకట్టుకు కేంద్రంగా ఉన్న సాయన్న చానెల్ కొరంబో పనులను ప్రభుత్వం విస్మరించిందని ఏపీ రైతు సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. దాదాపు 14 ఉప కాల్వల ఆధునికీకరణకు రూ.13 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. పాతచెలిగానవలస హెడ్ నుంచి దాదాపు 15 కిలోమీటర్ల పొడవుతో 14 ఉపకాల్వలు ఉన్నాయని..ఇవి సాగునీరు అందించడం లేదని తెలిపారు. కనీసం హెడ్‌లో కొరంబో పనులు చేసి రైతులకు నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు.

నెంబర్ లేకపోయినా..



నెంబర్ బోర్డు లేని కారు, నెంబర్ బోర్డు లేకుండా వెళ్తున్న లారీ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 8: పొరపాటున ఎవరైనా వాహనదారుడు ఏవైనా పత్రాలు చూపించకపోతేనే సవాలక్ష ప్రశ్నలు.. జరిమానాలు విధించే యంత్రాంగం ఏకంగా నెంబర్ బోర్డు లేకుండా వాహనాలు తిరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. ఏదైనా ప్రమాదాలు జరిగితే ఏ వాహనం నెంబర్‌పై ఫిర్యాదు చేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిఘా వ్యవస్థ నిద్ర పోతోందని, దీనికి ఈ వాహనాలే తార్కాణమని అంటున్నారు. గురువారం ఎమ్మెల్యే స్టిక్కర్‌తో నెంబరు బోర్డు లేకుండా ఓ కారు ఎస్.కోట నియోజకవర్గంలో చక్కర్లు కొట్టింది. అలాగే బొగ్గు యాస్‌తో లారీ, పశువులతో వ్యాను నెంబరు బోర్డులు లేకుండా దర్శనమిచ్చాయి. ఇవన్నీ కొత్తవలస చెక్‌పోస్టును దాటుకుని విశాఖ వైపు వెళ్లడం గమనార్హం.

చంద్రబాబుతోనే సంక్షేమం

- గ్రామాల్లో టీడీపీ బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ
- మినీ మేనిఫెస్టోలో అంశాలపై ప్రచారం
- పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపు

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమ పాలన ఉంటుందని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు చంద్రబాబు ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



శృంగవరపుకోట: మాట్లాడుతున్న కోళ్ల లలిత కుమారి,


సీతానగరం: గ్రామాల్లో పర్యటిస్తున్న విజయచంద్ర


కురుపాం రూరల్: 'బాబు ష్యూరిటీ'లో జగదీశ్వరి

చంద్రబాబునే ప్రజలు కోరుకుంటున్నారు

శృంగవరపుకోట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడే కావాలని తెలుగు ప్రజలు కోరుకుంటున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం శృంగవరపుకోట పట్టణంలోని బూత్ నెంబర్ 28లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రిజిస్ట్రేషన్ చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నీ అమలవుతాయని వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, బూత్ ఇన్‌చార్జి చెక్కకిరణ్ కుమార్, నాయకులు మల్లేశ్వరరావు, రమణాజీ, భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి తదితరులున్నారు.

నియోజకవర్గం ఇప్పుడు గుర్తుకొచ్చిందా..?

గరివిడి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గం గుర్తుకొచ్చిందా.. అని మంత్రి బొత్సను ఉద్దేశించి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున ఎద్దేవా చేశారు. దేవాడ గ్రామంలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికలు వచ్చాయి కావున నియోజకవర్గ ప్రజలు గుర్తు వచ్చారా.. అని ఎద్దేవా చేశారు. మంత్రి బొత్స రెస్కో విలీనం చేసి నియోజకవర్గ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్‌బాబు, వాసు, సూరి, సత్యం, చిట్టయ్య, నాజాన శ్రీరాముల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

సీతానగరం: చంద్రబాబు ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల వైపే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని టీడీపీ పార్వతీపురం నియోజకవర్గం బోనెల విజయచంద్ర అన్నారు. నూకలవాడ, వెంగాపురం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో ఆయన గురువారం పర్యటించి, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంకి రామ్మోహన్‌రావు, బాబ్జీ, శ్రీనివాసరావు, శేషగిరిరావు, రమణ, వైకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెదగొత్తిలిలో ..

కురుపాం రూరల్: పెదగొత్తిలి పంచాయతీ పరిధిలోగల డి.బారామణి, పెదగొత్తిలి గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం ఇన్‌చార్జి టి.జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై బాబు ప్రకటించిన 6 గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

స్తంభాన్ని తొలగించండి సారూ!


రహదారి మధ్యలో ఉన్న సెంటర్ లైటింగ్ స్తంభం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద గల సెంటర్ లైటింగ్ స్తంభాన్ని రెండు రోజుల కిందట లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో స్తంభం నేలకొరిగిన విషయం విదితమే. దీన్ని నాలుగు రోడ్ల కూడలి వద్ద నుంచి తరలించకుండా సంబంధిత అధికారులు వదిలేయడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్పందించి స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేయండి


మాట్లాడుతున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో 40ఏళ్ల లోపు ఉన్న వారందరికీ సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. గురువారం కుశిమి పీహెచ్‌సీని పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించి సికిల్‌సెల్ ఎనీమియా టెస్టులపై సూచనలు చేశారు. ఆ నివేదికలను ఐటీడీఏ కార్యాలయానికి అందజేయాలన్నారు. అనంతరం హడ్డుబంగి, కె.గుమ్మడలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీల వద్ద ఉన్న సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ● పీవో కల్పనాకుమారి ఆదేశాను సారం గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజ్ మండల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ట్రైబుల్ గ్రామాల్లో పూర్తిస్థాయిలో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పాలవలస ఉమామహేశ్వరి, నితీష్ పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చాలి

వీరఘట్టం: వీరఘట్టం మేజర్ పంచాయతీలోని తాగునీటి పైపులైను నిత్యం మరమ్మతులకు గురవుతోంది. ఈ కారణంగా ముచ్చర్ల వీధి, చాకలి వీధి ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని తాగునీరు స క్రమంగా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

వసతిగృహాలు పరిశీలించిన ఫుడ్ కమిషన్ మెంబర్

● మెనూ సక్రమంగా పాటించకపోవడంపై ఆగ్రహం


మెనూ పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు

కురుపాం: కురుపాంలోగల వసతి గృహాలు, రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలల తీరుపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ బి.కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం కురుపాంలోగల ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు, మహాత్మా జోతీరావ్ పూలే బాలుర రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల, కేజీబీవీని పరిశీలించారు. ఎస్సీ వసతి గృహంలో మెనూ సక్రమంగా లేకపోవడం, వసతి సదుపాయాలు సక్రమంగా లేనందున ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌కు మెమో ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఎంజీపీ స్కూల్‌లో మెనూ అమలు చేయలేదని నిలదీశారు. స్టాక్ రిజిస్టర్‌లో దిద్దుబాట్లు ఉండడంపై ఆరా తీశారు. బాత్‌రూంల దుర్వాసనపై మండిపడ్డారు. అలాగే స్థానిక ఎంఎల్ఎస్ గొడౌన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో శివప్రసాద్, డీఎం నాయక్, ఏఎం చిన్నికృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతియుత జీవనమే మార్గం కావాలి

● ముస్లిం జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడు ఇబ్రహీం


మాట్లాడుతున్న ఇబ్రహీం

పార్వతీపురం టౌన్: శాంతియుత జీవనమే మార్గం కావాలని ముస్లిం జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం హుస్సేన్ అన్నారు. గురువారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో పార్వతీపురం మన్యం జిల్లా ముస్లింల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ముస్లిం కమిటీ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులంతా శాంతియుత జీవనంతో... భావితరాలవారు సన్మార్గంలో పయనించేలా మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా షేక్ హిమామ్ బాషా, కార్యదర్శిగా షేక్ జిలాని, సహాయ కార్యదర్శిగా ముక్తార్ బాషా, కోశాధికారిగా ఎంఎం జలాల్‌లను సభ్యులు ఎన్నుకున్నారు.

నేడు ఆశీలు వేలం

పాలకొండ: నగర పంచాయతీలోని మార్కెట్‌లో రోజువారీ మార్కెట్ ఆశీలు, వారపు సంతలు, చెట్ల ఫలసాయం, కబేళా, రోడ్డు మార్జిన్లు తదితరుల నుంచి ఆశీలు వసూలు చేయడానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన బహిరంగ వేలం ఈ నెల 9న నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో వేలం జరుగుతుందని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రాల పరిధిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ కె.జయ తెలిపారు. నాగూరు, రావివలస, లఖనాపురం, తదితర పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 25 పంచాయతీలకుగాను 49 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే 23 కేంద్రాలను పరిశీలించామన్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కేంద్రాల నిర్వహణపై సంబంధిత బీఎల్వోలు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఈ పరిశీలనలో మండల ఆర్ఐ మండంగి కృష్ణ, బీఎల్వోలు రెడ్డి వినాయక్, ఎల్.సంతోష్, ఉరిటి హేమలత, తదితరులు ఉన్నారు.

రేషన్ పంపిణీలో జాప్యం చేయొద్దు

గరుగుబిల్లి: గ్రామాల్లో లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందించడంలో జాప్యం చేయకూడదని తహసీల్దార్ కె.జయ సూచించారు. రావివలసలో నిత్యావసర సరుకుల పంపిణీని ఆమె గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల మేరకు సరుకులు అందించాలన్నారు. తూనికల్లో వ్యత్యాసం ఉన్నట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక ధరలకు అమ్మకం చేసినట్లు ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఈ పరిశీలనలో ఆర్ఐ ఎం.కృష్ణ, వీఆర్వో రెడ్డి వినాయక్, ఎస్.సురేష్ ఉన్నారు.

నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు


నాదెండ్ల మనోహర్‌తో మల్లేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణపై ఆయనకు వివరించారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని మనోహర్ సూచించినట్టు మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అరకు పార్లమెంట్ అధ్యక్షుడు వి.గంగులయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: గ్రామాల అభివృద్ధికి పలు శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఐసీడీఎస్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారించాలని, సమయానికి పోషకాహారం అందించాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు ప్రతి సచివాలయంలో నెలకు మూడు దఫాలు ఆరోగ్యంపై సమీక్ష నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారులు కేకే సాగర్‌వర్మ, కె.కార్తీక్, సీడీపీవో జి.సుగుణకుమారితో పాటు పలు శాఖల అధికారులు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు మాఫీ చేయాలి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ: కౌలు రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు డిమాండ్ చేశారు. పాలకొండ ఆర్డీవో వి.వి.రమణకు గురువారం వినతిపత్రం అందించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులకు పంట రుణాలను రూ.రెండు లక్షల వరకు మాఫీ చేయాలన్నారు. వ్యవసాయ సాగు సాయం ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. జీడి, మామిడి పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘ నాయకులు గురుబిల్లి అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తినాయుడు, మజ్జి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతాపు భాషలో పాఠ్యపుస్తకాలు


రేగిడి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలను సందర్శిస్తున్న బృందం

గుమ్మలక్ష్మీపురం: జాతాపు భాషలో పాఠ్య పుస్తకాల తయారీ కోసం యూనివర్సిటీ ఆఫ్ మైసూరు నుంచి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ బృందం గురువారం గుమ్మలక్ష్మీపురం మండలం గొర్రెడ, రేగిడి గిరిజన ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. అంగన్‌వాడీ, పాఠశాలలను పరిశీలించి గ్రామస్థులతో మమేకమయ్యారు. జాతాపు భాష వివరాలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 72 భారత భాషల అభివృద్ధి కోసం ప్రోగ్రాం నిర్వహిస్తున్నారని చెప్పారు. త్వరలో ఈ పుస్తకాలను ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ బృందంలో మైసూర్ నుంచి వచ్చిన ప్రొఫెసర్లు ప్రేమ్‌కుమార్, డి.రమేష్, భూషణ్, ఐటీడీఏ ఏఎంవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్డీవోను కలిసిన డీఎస్పీ

పాలకొండ: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ డివిజనల్ అధికారి వి.వి.రమణను పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

సచివాలయాల్లో మొరాయిస్తున్న సర్వర్లు

గజపతినగరం: జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేపడుతున్న అధికారులకు సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్లు మొరాయించడంతో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సచివాలయాల్లో పడిగాపులు కాయాల్సి వస్తుందని వాపోతున్నారు. గజపతినగరం గ్రామ సచివాలయానికి సంబంధించి 311 ఇళ్ల రిజిస్ట్రేషన్లకుగాను 50 మందికి మాత్రమే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాగా, పురిటిపెంట సచివాలయానికి 350 మందికిగాను 150 మందికి, మరుపల్లిలో 83మందికిగాను 21మందికి మాత్రమే ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. గురువారం గజపతినగరం సచివాలయంలో తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, మరుపల్లిలో ఎంపీడీవో జయింత్రప్రసాద్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.

మత్స్య సంపదను మరింత ఉత్పత్తి చేయాలి

గంట్యాడ: మత్స్య సంపద ను మరింత ఉత్పత్తి చేయాలని ఏపీఐఐటీసీ డీడీ పి.లక్ష్మణ రావు (విజయవాడ) పిలుపుని చ్చారు. కొర్లాం గ్రామంలోని మత్స్యకార సంఘాలతో ఆయన గురువారం సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార సంఘాల సభ్యులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. చేపలు పెంచే సమయంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. చేపపిల్లలకు, చేపలకు వచ్చే వ్యాధి నిరోధక చర్యలను వివరించారు. సంఘాలకు అవసరమైతే వాహనాలు, ఐస్ బాక్సులు, బొలేరో వ్యాన్లను రాయితీపై ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ డీడీ నిర్మలకుమారి, పంచాయతీ కార్యదర్శి కొల్లి ధనంజయరావు పాల్గొన్నారు.

శంఖారావాన్ని విజయవంతం చేయండి

గజపతినగరం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉత్తరాంధ్రలో ఈనెల 11 నుంచి తలపెట్టిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ఉత్తరాంధ్రలో కొనసాగనందున శంఖారావం పేరుతో సభలు నిర్వహించి భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 7 వేల డీఎస్సీ పోస్టులు మంజూరు చేస్తే... జగన్ 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం మాట తప్పడం కాదా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో 5వ పర్యాయం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం, గంట్యాడ, దత్తిరాజేరు, మండల పార్టీల అధ్యక్షులు లక్ష్మునాయుడు, కొండపల్లి భాస్కరనాయుడు, పెద్దింటి మోహన్, బొండపల్లి మాజీ జడ్పీటీసీ బి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీ

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర బడ్జెట్ అంతా అంకెల గారడీ అని టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వరి ఆరోపించారు. ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలు కొండంత.. ఖర్చులు పిసరంతలా ఉన్నా యని విమర్శించారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెంచారని, విద్యుత్ చార్జీల వడ్డనలో ఎక్కడా రాజీ పడలేదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం కోర్టు ప్రాంగణంలో మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సీతానగరం: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభను నిర్వహించారు. ఎంపీడీవో ఈశ్వరరావు అధ్యక్షతన డ్వామా పీడీ రామచంద్రరావు సమక్షంలో డీఆర్పీలు పంచాయతీల వారీగా నివేదికను చదివి వినిపించారు. ప్రధానంగా గెడ్డలుప్పి పంచాయతీ వెలుగు వీవో.. ఉపాధి మేట్‌గా విధులు నిర్వహించడంపై సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని పంచాయతీల్లో మస్తర్ల దిద్దిబాట్లు, వేతనదారులు సంతకాలు లేనప్పటికీ చెల్లింపులు చేపట్టడాన్ని సిబ్బంది గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాను, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి

కురుపాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే ఏడాదిలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం ఆ కళాశాల అధ్యాపకులు వివిధ పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈక్రమంలో గురువారం కురుపాం, శివ్వన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలు, జోతిబాపూలే పాఠశాల, జీటీడబ్ల్యూ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులు, హాస్టల్ సదుపాయం, ల్యాబ్, అర్హత గల లెక్చరర్లతో విద్య బోధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

కురుపాం: రహదారి భద్రతపై ప్రతిఒక్క డ్రైవర్ అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం కురుపాంలో వివిధ వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రత, పాటించవలసిన నియమాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదని సూచించారు. అనంతరం రహదారి భద్రతా నియమాలపై డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

ఒడిశా

వారి అనుభవాలే మనకు పాఠాలు


ర్యాలీ చేస్తున్న సీనియర్ సిటిజన్స్

రాయగడ: సీనియర్ సిటిజన్స్ అనుభవాలే భావితరాలకు పాఠాలని, వారి క్రమశిక్షణ మనకు మార్గదర్శకమని ఎస్పీ హరీష్ బిసి అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ సంఘం 12వ వార్షికోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో అధ్యక్షుడు వినోద్‌పండా అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్‌కు పోలీసు శాఖ నుంచి అన్ని విధాల సహకారం అందిస్తామని, త్వరలో వారికి గుర్తింపు కార్డులు అందజేస్తామని తెలిపారు. అధ్యక్షుడు వినోద్ పండా మాట్లాడుతూ సంఘం తరపున వివిధ సామాజిక ప్రయోజిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా ఆదివాసీ మహిళలకు ఎస్పీ చేతులమీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ భాస్కరచంద్ర రోయిత్, సంఘం ఉపాధ్యక్షులు వెంగళరావు, బలరాం చౌదురి, పలువురు సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. తొలుత వారంతా కపిలాష కూడలి నుంచి ర్యాలీగా తమ కార్యాలయానికి చేరుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రాయగడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ పీకే త్రిపాఠి అన్నారు. స్థానిక యూజీఎంఐటీ పాలిటెక్నికల్ కళాశాలలో హెడ్ ఆఫ్ ద డిపార్టుమెంట్ సరోజ్ కుమార్ సాహు అధ్యక్షతన రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్గొని రక్త దానం చేసారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ గౌతమ్ పట్నాయక్ 76 యూనిట్ల రక్తం సేకరించినట్లు వెల్లడించారు.